మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ /వనపర్తి /జోగులాంబ గద్వాల /నారాయణపేట

# అధికారులు సమన్వయంతో ప్రజాపాలనను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 27 ప్రభాతవార్త :** ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులందరూ సమన్వయతో కలిసి పనిచేసి విజయవంతం చేయాలని నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రజా పాలనపై ముందస్తు సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. వారితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపిలు, జడ్పీ చైర్మన్‌లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు, ఉద్యోగులు సిబ్బంది చేయి చేయి కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించాలన్నారు. అలాగే కొత్త గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన సరైన గైడ్‌లైన్స్‌ను వివరించాలన్నారు. సమావేశంలో పాల్గొన్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలుచేసి అర్హులందరికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. 6 గ్యారంటీల అమలుపై క్లియర్ గైడ్‌లైన్స్ ఇస్తే తాము ప్రజలకు వాటిని వివరించి దరఖాస్తు చేయిస్తామన్నారు. అంతకు ముందు సమావేశంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 28 నుండి జనవరి ఆరవ తేదీ వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందుకుగాను మండలానికి ఒక ప్రత్యేక అధికారి ఉంటారని, ఆరు గ్యారంటీల స్వీకరణతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారని తెలిపారు.

## ప్రజల సమక్షంలోనే ప్రభుత్వ పథకాల అమలు...

**కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణి... ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్27, ప్రభాతవార్త:** ప్రభుత్వ పథకాల అమలు కోసం లబ్దిపొందేందుకు ఎదురు చూడాల్సిన అవసరం లేదని ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమక్షంలోనే సంక్షేమ పథకాల అమలు ఇక నుండి కొనసాగుతుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం అడ్డాకుల మండలం బలిద్‌పల్లి, కన్మనూర్, చిన్న మునగల్చేడ్, జల్లా ఘణపురం మండల పరిధిలోని మహమ్మద్ హుస్సెన్ పల్లి గ్రామాలకు చెందిన పలువురు లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను అడ్డాకుల మండల తాసిల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాల లబ్ది పొందాలంటే ప్రజా ప్రతినిధుల ఇండ్ల, అధికారుల చుట్టూ తమ పనులను మానుకుని ప్రజలు తిరగాల్సి పరిస్థితి ఉండేదని అలాంటి రోజులు కనుమరుగు అయ్యి ప్రజల సమక్షంలోనే ప్రభుత్వ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 28 నుండి ప్రతి గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని , గ్రామాల్లోని అర్హులైన ప్రతి ఒక్కరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా పాలన కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లను చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల తాసిల్దార్ ఘాన్సీ రామ్, మూసాపేట మండల తాసిల్దార్ తో పాటు ఆయా గ్రామాల పార్టి నాయకులు , కార్యకర్తలు , అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**అడ్డాకుల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండల తహసిల్దార్ కార్యాలయంలో వనపర్తి నియోజకవర్గం నాలుగు గ్రామాల లబ్దిదారులు 8 మందికి వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అహంకార పూరిత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు పక్కన పెట్టి ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం చేకూరుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీల పథకాన్ని 28వ తేదీ నుం డి ప్రజా పాలన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెడుతున్న ప్రజా పాలన 28వ తేదీ నుండి 6వ తేదీ వరకు 5 గ్యారంటీ పథకాలను ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజలు అందరు బయట ఉన్నవాళ్ళు కూడా తమ తమ గ్రామాలకు వచ్చి దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మండల తహసిల్దార్ ఝాన్సి రామ్, డిప్యూటి తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిటిసి శకుంతలమ్మ, గణేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి గంగుల శ్రీనివాస్‌రెడ్డి, భీమన్న యాదవ్, శేఖర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 28 నుండి 6వ తేదీ వరకు గ్రామాలలో ప్రజాపాలన..

**ఐదు గ్యారంటీ పథకాలకు ఒకే దరఖాస్తు**

**ఇటిక్యాల, డిసెంబరు 27 ప్రభాతవార్త :** కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 28 నుండి వచ్చిన ఆరో తేదీ వరకు గ్రామాలలో అభయహస్తం పథకం కింద అర్హులైన వారు పథకాలకు ఒకే దరఖాస్తు ద్వారా చేసుకోవచ్చని తహసిల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపిడిఓ రాఘవ, ఎంపిఓ భాస్కర్ యాదవ్‌లు తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ప్రజలు గ్రామాలలోనే దరఖాస్తులు చేసుకోవచ్చని వారు సూచించారు. ఆయా పథకాల కోసం దరఖాస్తులో పొందుపర్చిన ధృవపత్రాల ఆధారంగా వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు 28 నుండి వచ్చేనెల ఆరోతేదీ వరకు పథకాలకోసం గ్రామాలలోని గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు ఇటిక్యాల మండలంలో గురువారం మొదటిరోజు గోపాల్‌దిన్నె గ్రామంలో తహసిల్దార్ వెంకటేశ్వర్లు, మొగిలి రావల్ చెరువు గ్రామంలో ఎంపిఓ భాస్కర్ యాదవ్, ఎర్రవల్లి మండలంలో భట్లదిన్నె గ్రామంలో ఎంపిడిఓ రాఘవ, ఎర్రవల్లి గ్రామంలో ఇంఛార్జి తహసిల్దార్ నందిని అధికారులుగా ఉన్నారు. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో నాలుగు గ్రామాలలో ఐదు గ్యారంటీ పథకాల కోసం అర్హులైన వారినుండి గ్రామసలో దరఖాస్తులు తీసుకుంటుండగా అదేవిధంగా కొత్తగా రేషన్‌కార్డు కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని వారు వివరించారు. గ్రామంలో ఉదయ నుండి సాయంత్రం వరకు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ రాఘవ వివరించారు. దరఖాస్తులు స్వీకరించేందుకు గాను పక్క గ్రామాల నుండి పంచాయతీ కార్యదర్శులను టీంగా ఏర్పాటు చేసినట్లు ముందుగా ఒకరోజు ఆ గ్రామంలో చాటింపు ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే దరఖాస్తులు తీసుకునే చోట ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## ప్రజా పాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలి.

**జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్...**


కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ

**కొత్తకోట, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** ప్రజాపాలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని జడ్పీవైస్ చైర్మన్ వామన్ గౌడ్ అన్నారు. బుధవారం కొత్తకోట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా పాలన కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి జనవరి 6 2024 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని గ్రామస్థాయి, మండల స్థాయి, పట్టణ స్థాయిలలో అవసరమైన అధికార బృందాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామస భలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మండలానికి ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేశారని తెలిపా రు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు ఒక గ్రామ పంచాయతీలో, మధ్యాహ్నం 2 నుండి 6 గంటల వరకు మరో గ్రామ పంచాయతీలో, అలాగే మున్సిపల్ వార్డులలో సైతం కార్య క్రమాన్ని నిర్వహించి అర్హులైన లబ్దిదారుల నుండి దరఖాస్తులను తీసుకోవాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు. గ్రామసభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వా ర్డులలో ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించేందుకు టాం.. టాం.. వేయించాలన్నారు. గ్రామసభ కోసం సిబ్బందిని నియమించాలని, దరఖాస్తుల స్వీకరణ కోసం కౌంటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూ చించారు. అదేవిధంగా పట్టణ ప్రాంతాలలోని ఆయా వార్డులలో సైతం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని అన్నారు. మేజర్ గ్రామాల్లో ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిం చాలన్నారు. గ్రామసభ నిర్వహణ సందర్భంగా లబ్దిదారులకు తాగునీరు, దరఖాస్తుల స్వీకరణలకు కౌంటర్లు, షామియానాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవం తం చేసే బాధ్యత ప్రతి ఒక్క అధికార పై ఉందన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి యుగేందర్ రెడ్డి, తహసిల్దార్ బాల్ రెడ్డి, ఎంపీ డీ ఓ కృష్ణయ్య, ఏవో మున్నా, ఎంపిఓ రవీందర్ బాబు, ఏపీఎం రాములు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ అధికారులు, అంగన్వాడి కార్యకర్తలు ఆయా శాఖాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన ఆయా శాఖల అధికారులు

# లబ్ధిదారులకే నేరుగా పథకాలు..!

- ప్రతి గ్రామం ప్రతి వార్డులో సమావేశాలు
- లబ్దిదారులు దరఖాస్తు చేసుకోవాలి
- నేటినుంచి వచ్చేనెల ఆరు తారీఖు వరకు అవకాశం
- ఇంఛారిన మంత్రి దామోదర రాజనర్సింహ
- మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో
- ప్రజాపాలన సన్నాహక సమావేశం
- పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు,
- ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు



ప్రజాపాలన సన్నాహక సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 27 ప్రభాతవార్త :** సంక్షేమ పథకాల లబ్దిని నేరుగా లబ్దిదారులకు అందించాలన్న బాధ్యతతో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి సి. దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి ఈనెల 28 నుండి జనవరి 6 వరకు నిర్వహించనున్న ప్రజా పాలన కార్యక్రమం సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందేలా చూడాల్సి బాధ్యత ప్రభుత్వానికి ఉందని, ఒక బాధ్యతతో సక్రమంగా వాటిని ప్రజలకు అందించే ఆలోచనతోనే ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామని, ఇందులో భాగంగానే 6 గ్యారంటీలను అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అధికారగణం ప్రజల ముందుకు వెళ్లి వాటిని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు అధికారులు గ్రామాలకు వెళ్లి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని, ఈనెల 28 నుండి జనవరి 6 వరకు దరఖాస్తులను స్వీకరించిన అనంతరం కూడా ఇద్దరు అధికారులు గ్రామాల్లో కొనసాగుతూ ప్రజల వద్ద నుండి తప్పపోయిన వారి నుండి దరఖాస్తులు స్వీకరిస్తానని తెలిపారు. కార్యక్రమం అనంతరం మిగిలిపోయిన వారు పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తులు ఇవ్వవచ్చని చెప్పారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని ఇచ్చిన వాగ్దానాన్నింటిని నెరవేరుస్తామని, ప్రజాపాలన కార్యక్రమం అమలుకు మరిన్ని సూచనలు ఇస్తే పాటిస్తామని తెలిపారు.

**అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు..**
**మంత్రి జూపల్లి కృష్ణారావు**

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా తెలంగాణ వచ్చిందని ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీల అమలుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టామని, అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకుంటున్నదని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని, ఎవరికి ఇబ్బంది కలగకుండా దరఖాస్తులు స్వీకరించాలని, వీలైన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని, కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజాపాలన కార్యక్రమంపై అన్ని రకాలుగా ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిదులపై ఉందని అన్నారు. ముందుగా వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, లబ్దిదారులకు ముందుగానే రూపొందించిన దరఖాస్తు ఫారాన్ని అందించి వారు దానిని నింపి ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నామని, దరఖాస్తు స్వీకరించిన అనంతరం వారికి రసీదు ఇవ్వడం జరుగుతుందని, గ్రామాల షెడ్యూల్ అందరికి తెలియజేసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని దీనికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 28 నుండి జనవరి ఆరవతేదీ - మిగతా4లో..

# ప్రజా పాలన అభయహస్తం
# 6 గ్యారెంటీల అమలుకు శ్రీకారం...

**కల్వకుర్తి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం 6 గ్యారెంటీలకు లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం పాత బ్రాహ్మణపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకమైన పాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టిన అభయహస్తంలోని 6 గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద ప్రతి నెల రూ. 2500ల ఆర్థిక సహాయం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకం క్రింద ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15వేలు, ప్రతి ఏటా వ్యవసాయ కూలీలకు రూ. 12వేలు, వరి పంటకు రూ. 500ల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

బోనస్, ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, రూ. 5లక్షల సహాయం, ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు 250 చ॥గజముల స్థలం, గృహ జ్యోతి పథకం క్రింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకం క్రింద నెలకు రూ. 4వేలు, దివ్యాంగులకు రూ. 6వేల ఫించన్ల కొరకు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులు 6 గ్యారెంటీ పథకాలకు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పాత బ్రాహ్మణపల్లిలో మండల కోఆప్షన్ సభ్యులు జోజిరెడ్డి కుమారుడి వివాహా వేడుకలో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి కాంగ్రెస్ ప్రజాపాలన..!!

- ఆరు గ్యారంటీల అమలుకు కసరత్తు..
- గ్రామాలు,పట్టణాలు,డివిజన్లు,వార్డులలో అధికారుల విస్తృతస్థాయి సభలు..
- మహాలక్ష్మి,గృహజ్యోతి,ఇందిరమ్మ ఇళ్లు, రు.500లకు వంటగ్యాస్,200యూనిట్ల ఉచిత విద్యుత్తు..
- వృద్ధులు,వికలాంగులకు చేయూత కింద ఫించన్ల కోసం లబ్దిదారుల ఎంపిక కోసం విస్తృత ఏర్పాట్లు..

**భూత్పూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీల పథకం కోసం కాంగ్రెస్ ఆవిర్భావ దినం సందర్భంగా ఈ నెల 28నుంచి వచ్చే నెల 6వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన పేరిట గ్రామ సభలు నిర్వహిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తక్షణమే సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆరు గ్యారంటీలలో రెండింటిపై తొలి సంతకం చేసిన సంగతి విధితమే. రాష్ట్రమంతటా మహిళలు, బాలికలు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణం చేసే వీలుగా ఫైల్‌పై తొలి సంతకం చేయగా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద తెల రేషన్‌కార్డుదారులకు వ్యయపరిమితిని రు. 5లక్షల నుంచి రు. 10లక్షలకు పంచే ఫైల్‌పై మలి సంతకం చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేది నుంచి మహిళలు, బాలికలు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వీలుగా అవకాశం కల్పించారు. ప్రకటించిన మిగిలిన పథకాలకు లబ్దిదారులను ఎంపిక చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేది నుంచి జనవరి 6వ తేది వరకు ప్రభుత్వ యంత్రాంగం గ్రామలు, పట్టణాలు, డివిజన్లు, వార్డులలో సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామసభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి, గృహజ్యోతి, రు. 500లకు వంటగ్యాస్ సిలెండర్ల పంపిణీ, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా, వికలాంగులు, వృద్ధులకు చేయూత పథకం కింద ఫించన్లు వంటి ప్రభుత్వ పథకాలు పొందేందుకు సామాన్యజనం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఆన్‌లైన్ కోసం మీ సేవా కేంద్రాలకు ఎగబడకుండా ప్రజల వద్దకే అధికారులు వచ్చి గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ అధిష్టానం, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహించేందుకు - మిగతా4లో..

# భక్తిపారవశ్యంతో పులకించిన చిన్నరాజమూర్..!

- వైభవంగా అంజనేయస్వామి రథోత్సవం
- సాంప్రదాయరీతిలో కోనేరులో అవభృతస్నానం
- గజవాహనంపై తేరుమైదానికి వచ్చిన స్వామివారు
- రథంపై ఊరేగుతూ భక్తకోటికి స్వామివారి దర్శనం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- దాసంగాలతో స్వామివారికి నైవేధ్యాలు


స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం


స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు


గజవాహనం పై
స్వామివారిని తీసుకవస్తున్న పురోహితులు

**దేవరకద్ర, డిసెంబరు 27 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న దేవరకద్ర మండలంలోని చిన్నరాజమూర్ బుదవారం భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలోని ప్రధానఘట్టమైన స్వామి వారి రథోత్సవాన్ని తెల్లవారుజామున అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్వామి వారి గజవాహనసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారిని గజవాహనపై దేవస్థానం చుట్టూ ఊరేగించారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరణల మద్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ ప్రదిక్షణల అనంతరం స్వామి వారిని అదే గజవాహనంపై దేవస్థానం ముందున్న తేరుమైదానానికి ఊరేగింపుగా తీసుకవచ్చారు. అనంతరం ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారిని శోభాయమానంగా అలంకరించిన రథపై ఊరేగించారు. బ్యాండు వాయిద్యాలు, భక్తుల హరినామశ్చరణ, శివసత్తుల పూనకాలు, బాణాసంచ పేలుళ్ళ మద్య ఈ రథోత్సవం ముందుకు కదిలింది. పురోహితులు శాస్త్రోక్తంగా ఈ పవిత్ర ఘట్టాన్ని నిర్వహించారు. స్వామి వారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా అలంకరణలో స్వామి వారు దేవస్థానం ఆవరణలో రథంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన కొన్ని వేల మంది భక్తులు స్వామి వారి రథోత్సవాన్ని కనులారా తిలకించి తన్మయం చెందారు.

**ఘనంగా పవళింపుసేవ..**

రథోత్సవం అనంతరం దేవస్థానంలో స్వామి వారి పవళింపుసేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రథోత్సవం అనంతరం స్వామి వారిని దేవస్థానంలోకి తీసుకవచ్చి ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో సర్వాంగసుందరంగా అలంకరించిన ఊయలలో స్వామి వారిని ఉంచి ఈ కార్యక్రమాన్ని నయనానందంగా నిర్వహించారు. స్వామి వారిని ఊయలలో పరుండబెట్టి వివిధ దైవగీతాలను ఆలపించారు. అలాగే మహాలంకరణ, పంచామృతాభిషేకం, వివిధ పూజలు నిర్వహించారు.

**వైభవంగా అవభృతస్నానం..**

చిన్నరాజమూర్‌లో దేవస్థానం కోనేరులో స్వామి వారి అవభృతస్నానం పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని పల్లకిలో దేవస్థానం నుండి కోనేరు వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్ళి ఈ కార్యక్రమాన్ని పురోహితులు నిర్వహించారు. దైవనామాన్ని స్మరిస్తూ ఈ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే స్వామి వారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విరాట్‌ను వివిధ రకరకాల పూలతో పాటు వివిధ ఆభరణాలతో సార్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కూడ అలంకరించారు.

**భక్తిపారవశ్యంతో పులకించిన చిన్నరాజమూర్..**

ఆంజనేయస్వామి రథోత్సవంతో చిన్నరాజమూర్ భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. ఈ ఉత్సవాలకు జిల్లా ను ఒడేగాక ఇతర రాష్ట్రాలనుండి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో చిన్నరాజమూర్ జనసంద్రాన్ని తలపించింది. దేవస్థానం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకొన్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన భక్తులే కనిపించారు. స్వామి వారి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద వివిధ తినుబండారాలు, ఆటవస్తువులు, వంటసామగ్రి తదితర దుకాణాలు వెలిశాయి.

**దాసంగాలతో స్వామి వారిని నైవేధ్యాలు..**

చిన్నరాజమూర్‌లో వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిర భక్తులు ఉపవాసదీక్షలతో వచ్చి స్వామి వారికి దాసంగాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. తీపివంటకాలతో స్వామి వారికి నైవాధ్యాలు సమర్పించారు. దీంతో దేవస్థానం పరిసరాలు భక్తులు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాలనుండి భక్తులు బస్సులు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, వివిధ వాహనాలలో చిన్నరాజ మూర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవస్థానాన్ని వివిధ రంగురంగుల విద్యుత్ బల్బులతో శోభాయమానంగా అలంకరించారు.

## ప్రజాపాలన అభయహస్తం 6 గ్యారెంటీల ధరఖాస్తులను విజయవంతం చేద్దాం

### -పాల్గొననున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి

**వెల్దండ, డిసెంబర్27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం 6 గ్యారెంటీలకు లబ్ధిదారుల నుంచి ధరఖాస్తు తీసుకునే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి తెలిపారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ జయప్రకాష్‌తో కలిసి యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ పారదర్శకమైన పాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టిన అభయహస్తంలోని 6 గ్యారెంటీలను నేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు తీసుకోనున్నట్లు, కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నారన్నారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజుయాదవ్ ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా ఇంఛార్జ్ మంత్రిని కలిసి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే



జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మండల కాంగ్రెస్ నాయకులు

**ఇటిక్యాల, డిసెంబరు27 ప్రభాతవార్త:** ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రజాపాలన అమలులో భాగంగా అధికారుల సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసిసి కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పూలబొకేతో శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగ మంత్రులను కలిసిన వారిలో అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుఎర్రవల్లి సర్పంచ్ జోగులరవి, అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీమాజీ అధ్యక్షుడు శ్యామ్‌రావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్27, ప్రభాతవార్త:** వనపర్తి మండలం దత్తాయపల్లి గ్రామానికి చెందిన సార్ల గోవర్ధన్ సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుధవారం మృతుని నివాసం వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లుర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసాను ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కిచ్చారెడ్డి, నాయకులు గొల్ల

## గ్రామ దేవత గండమ్మ బోనాలు



**వెల్దండ, డిసెంబర్27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కంటోనిపల్లి గ్రామంలో బుధవారం గ్రామ దేవత గండమ్మ బోనాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేధ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కంఠంలక్ష్మణస్వామి, కంఠం రాజు, కొండలు, ఆంజనేయులు, వెంకటేష్, ప్రణీత్, శ్రీరాములుతో పాటు తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



**దేవరకద్ర, డిసెంబరు27 ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని శంషాబాద్‌లో బుధవారం జరిగిన అయ్యప్ప మహాపడి పూజలో లాల్‌కోటకు చెందిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లాల్ కోట కెంగూరు అంజన్న యాదవ్ గురుస్వామితో పాటు దేవరకద్ర వ్యవసాయమార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ బలిజరాము, గోవర్ధన్ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

**ఇటిక్యాల, డిసెంబరు27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తా సమీపంలో గల కాంగ్రెస్ ముఖ్య నాయకుడు నీలి శ్రీనివాసులు నివాసంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం హాజరయ్యారు. ఈసందర్భంగా ఎన్నికల్లో కార్యకర్తలు పనిచేసినతీరుపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్యనాయకులులోకారెడ్డి, బజారన్న, ప్రభుదాసు, ఈదన్న నాయుడు, శివన్న నాయుడు, లింగరాజు, అల్లా బకాస్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహాం

# అవిశ్వాసం వైపు అడుగులు..?!

### వీపనగండ్ల ఎంపీపీ పదవికి అవిశ్వాస తీర్మానంపై పావులు కదుపుతున్న అధికార పార్టీ?



వీపనగండ్ల ఎంపీపీ కార్యాలయం

**వీపనగండ్ల, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వీపనగండ్ల గత రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల ఒకసారి స్థానిక సంస్థలైన ఎంపీపీ పదవికి అవిశ్వాసం ఏర్పాటు చేసుకొని వేరే వారిని ఎన్నుకునేటందుకోసం స్థానం కల్పించడం వల్ల ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అవిశ్వాసాలు తీర్మానాలను మండల పరిషత్‌లో పెట్టి తమకు సంబంధించిన వారిని ఎన్నుకోవాలని ఆలోచనలో ప్రస్తుత అధికార పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది అదే సందర్భంలో వీపనగండ్ల మండల ఎంపీపీ కమలేశ్వరరావు పై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మండల స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఆలోచన చేసినట్లు తెలిపింది దానికి సంబందించి అవిశ్వాసం ఎప్పుడు పెట్టాలి అనే ఆలోచన ఆయనపై వదిలినట్లు తెలుస్తుంది అయితే మండలంలో ఇప్పటివరకు ఎంపీటీసీలు వీపనగండ్ల గుండ్ల భాస్కర్‌రెడ్డి గోవర్ధనగిరి సూర్యవంశం చంద్రకళ సంగినేనిపల్లి ఇంద్రకంటి వెంకటేష్ తూముకుంట పోగాకు రాముడు బొల్లారం రాదలావత్ పార్వతి కల్వరాల పానుగుంటి కమలేశ్వరరావు పుల్గర్ జర్ల నాగర్ల వెంకటేశ్వరమ్మ ఎనిమిది మంది సభ్యులు ఉన్నారు. ఇందులో రెండు బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి గ్రూపుకు సంబంధించిన వ్యక్తులు ఎన్నిక కావడం జరిగింది మిగతా 6 గోవర్ధనగిరి సంగినేనిపల్లి బొల్లారం వల్లభాపురం కల్వరాల్ల పుల్గర్ జర్ల గ్రామాల ఎంపీటీసీలు ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గానికి సంబంధించిన వ్యక్తులు గెలవడం జరిగింది. దీనితో అప్పట్లో అవిశ్వాస తీర్మానం పెట్టాలని అనుకున్నప్పటికీ దానికి అవకాశం లేకపోవడంతో ప్రస్తుతం నాలుగు సంవత్సరాలు అయింది కాబట్టి అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం కూడా మారడం జరిగింది. కాబట్టి ఈ రకమైన టువంటి అధికారంలో మార్పు రావడంతో ప్రస్తుతము ఎంపీపీగా ఉన్న కమలేశ్వరావును మార్చాలని స్థానికి కాంగ్రెస్ నాయకులు ఆలోచిస్తున్నారు. అయితే ఇది ఎప్పుడు పెట్టాలి అనేటటువంటి సందర్భానికి వచ్చేవరకు సంక్రాంతి పండుగ ముందరనే ఈ అవిశ్వాస తీర్మానం పెట్టే యువచనలో ఉన్నట్లు తెలుస్తుంది అయితే ప్రస్తుతం కమలేశ్వరావు హర్షవర్ధన్ రెడ్డి వైపు వెళ్లడం తో మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఐదు మంది ఎంపీటీసీలు ఎక్కువగా ఉండటం వల్ల ఈ ఆలోచనలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ట్టు తెలిసింది అయితే వీరిలో కూడా ఎవరిని చేయాలి ఎంపీపీగా అన్న సందిగ్ధంలో ఆ పార్టీ నాయకులు ఉన్నట్లు తెలుస్తుంది వీరిలో బీసీ నాయకునిగా ఉన్న ఇంద్రకంటి వెంకటేష్, సంగినేనిపల్లి ఎంపీటీసీ మరియు పుల్గర్ జర్ల వైపు ఎంపీపీ గా ఉన్న నాగర్ల వెంకటేశ్వరమ్మ ఎంపీటీసీ నీ ఎంపీపీగా ప్రకటించాల అని వీరి ఇద్దరి మధ్యలో ఎవరిని చేయాలనే ఆలోచనలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నట్లు తెలుస్తుంది అయితే ఈ విషయాన్ని గూర్చి పెద్దగా ఎవరు ఇబ్బంది పడవద్దు అని తీర్మానం ద్వారా కాంగ్రెస్ పార్టీకి పెద్దగాఉపయోగం ఉంటుందాఅని కూడా ఒక చర్చ జరుగుతున్నట్లు సమాచారం ఏది ఏమైనాప్పటికీ అవిశ్వాసం తీర్మానం పెట్టాలన్నతి స్థానిక నాయకుల ఒత్తిడి మంత్రి పై పెరుగుతుందని సమాచారం.

## ప్రజా పాలన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొనాలి

● కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య యాదవ్





సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు బీరయ్య, హాజరైన కార్యకర్తలు

**వీపనగండ్ల, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** నేటి నుండి నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొని ప్రజల నుండి అధికారులకు అర్జీలు ఇప్పించాలని వీపనగండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల రైతు బంధు మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య కార్యకర్తలను కోరారు. బుధవారం నాడు వీపనగండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల స్థాయి నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ గ్రామాల నుండి ముఖ్యమై నటువంటి కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన కార్యక్రమాన్ని గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని ఈ నిర్వహణ కార్యక్రమాన్ని కార్యకర్తలు ముందుండి నడిపించాలని ప్రభుత్వ అధికారులతోసమన్వయం చేసుకుంటూ ప్రజలనుండి వారి వారి సమస్యల పైన దరఖాస్తులు ఇప్పించాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేసే విధంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అందుకోసం ప్రజలలో ఎలాంటి అపోహలు లేకుండా అర్జీలు తీసుకొని వాటిని పరిశీలించి పథకాలు అంది పేద ప్రజలకు అందించే బాధ్యత మన కార్యకర్తల పైన ఉన్నదని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగల వెంకటరెడ్డి పాము రాజశేఖర్ నక్క విష్ణు రఘునాథ్ రెడ్డి బిచ్చన్న వెంకటస్వామి రామిరెడ్డి పుట్ట గంగిరెడ్డి రవీందర్ రెడ్డి గోపి తదితరులు పాల్గొన్నారు.

## అవయవాలు దానం చేసిన వ్యక్తి కుటుంబానికి రావుల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న రావుల

**కొత్తకోట, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** కొత్తకోట మండలం, కానాయపల్లి గ్రామానికి చెందిన నక్కల రాము అనే యువకుడు ఈ నెల 15న ద్విచక్ర వాహనం పై వెళ్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొందారు. నక్కల రాము తలకు బలమైన గాయం అవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. అక్కడే మూడు రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే.. అక్కడి డాక్టర్ల సూచన మేరకు నక్కల రాము అవయావాలను దానం చేసి పదిమందికి ప్రాణదాతలు కావాలని కుటుంబ సభ్యులకు సూచించారు. తమ కుమారుడు మృతి చెందిన.. తన అవయవాల ద్వారా పదిమదికి ప్రాణాలు నిలబడతాయని ఉద్దేశంతో జీవన్ అమర్ ట్రస్ట్ నిర్వాహకులకు అవయవాలను దానం ఇచ్చేందుకు అంగీకరించి తమ పెద్ద మనసును చాటుకున్నారు. నక్కల రాము అవయవాలను దానం చేయడం ద్వారా తమ గ్రామమైన కానాయపల్లికి గుర్తింపు వచ్చిందని తెలియడంతో మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి తన స్వగ్రామమైన కానాయపల్లికి వచ్చి నక్కల రాము కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల ఆర్థిక సహాయం చేశారు. అవయవాలు దానం చేసిన నక్కల రాము జ్ఞాపకార్థం పదిమందికి ఉపయోగపడే ఆదర్శవంతమైన కార్యక్రమాన్ని చేపట్టాలని రావుల చంద్రశేఖర్ రెడ్డి గ్రామస్తులకు తెలిపారు. ఈ సందర్భంలో మాజీ సర్పంచ్ పోతులపల్లి యాదయ్య సాగర్, రావుల రఘువర్ధన్ రెడ్డి టిఆర్ఎస్ నాయకులు నక్కల శాంతన్న, గ్రామ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ హొటల్ రాజు, పి.వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ దారముని నాగరాజు, జే.పెద్ద కురుమయ్య, శాస్త్రి పాస్టరు, కొండి రాజు, నక్కల పెద్దగిరి రాముడు, చిన్నాన్న తదితరులు పాల్గొన్ని నక్కల రాము చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

## నేటి నుండి ప్రజా పాలన సదస్సు



వీపనగండ్ల మండల పరిషత్ అధికారి కథలప్ప

**వీపనగండ్ల, డిసెంబర్27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠా త్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమం నేటి నుండి గ్రామాల వారిగా అధికారులు వెళ్లి ప్రజలతో అర్జీలు తీసుకోవడం జరుగుతుందని వీపనగండ్ల మండల పరిషత్ అధికారి కథలప్ప తెలిపారు. ఆయన బుధవారం నాడు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపాలన సదస్సు కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేవిధంగా కార్యక్రమం రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. గ్రామాల వారీగా ఎంపీడీవోది1 టీం ఎమ్మార్వో అది ఒక టీముగా రెండు టీములుగా ఏర్పడి గ్రామాలలో ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ క్రింద చూపించిన గ్రామాల వారీగా అధికారులు పాల్గొని తేదీలు ప్రకటించడం జరిగిందని దాని ప్రకారంగా గ్రామసభలలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామాలవారిగా ఎంపీడీవో పాల్గొని గ్రామాలు కొర్లకుంట 28వ తేదీన వల్లభాపురం తండా 29వ తేదీసంగి నేనిపల్లి 30 తేదీన తూముకుంట జనవరి 2న సంపత్రావుపల్లి జనవరి 3న వీపనగండ్ల జనవరి 4న పాల్గొనడం జరుగుతుందని ఆయన అన్నా రు. తహసిల్దార్ టీముర్గంగవరం 28 నాగర్లబండ తండా 28 గోపాల్ దిన్నె 30 పుల్గర్ జర్ల జనవరి రెండవ నాగర్లబండ తండా 28 గోవర్ధనగిరి 29 గోపాల్ దిన్నె 30 పుల్గర్‌జర్ల జనవరి రెండవ తేదీన కల్వరాళ్ల జన వరి మూడవ తేదీన బొల్లారం జనవరి 4వ తేదీన ఈ తేదీల ప్రకారంగా ఆయ గ్రామపంచాయతీ దగ్గర సమావేశాలు ఏర్పాటు చేసి అర్జీలు తీసుకోవడం జరుగుతుందనిఆయన తెలిపారు. ప్రజలుప్రభుత్వం నిర్ణయించిన ప్రకారంగా దరఖాస్తుఫారం తీసుకొని వాటికిసంబంధించిన అప్లికేషన్లు జతచేసి ఆయా గ్రామాలకు వచ్చిన అధికారులకు అందజేయాలని ఆయన తెలిపారు.

## సందెపురాళ్ల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

**మక్తల్, డిసెంబరు27 ప్రభాతవార్త:** పట్టణంలోని పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన సందెపురాళ్ల పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కీ.శే. ఆడెంలక్షణ్ణ (రిటైర్డ్ టీచర్)కుమారుడు ఆడెం గోపి (సాయి గణేష్ మొబైల్స్) దాతలుగా మొదటి బహుమతి కింద గుడెబల్లూరుకు చెందిన సూరి (108 కేజీలు)కు 10 తులాల వెండి, రెండో బహుమతి కింద రన్నరప్ కున్సికి చెందిన నరసింహ (105 కేజీలో)కు తులాల వెండి, మూడో బహుమతి కింద ముదుమాల్‌కు చెందిన రాము (100 కేజీలు)కు 3 తులాల వెండి అందజేశారు. అనంతరం సందెపురాళ్ల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని పలువురు శాలువా కప్పి సత్కరించారు. ఈఓ శ్యాంసుంద రాచారి, అర్చకులు ప్రాణేశాచారి, అరవిందాచారి, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.



సందెపురాళ్ల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



## రైతుల కరెంటు సమస్యలను పరిష్కరించాలని వినతి

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** స్థానిక ఎలక్ట్రిసిటి డివిజన్ కార్యాలయంలో రైతుల సమస్యల మీద జరిగిన సదస్సు సందర్భంగా తెలంగాణ రైతు సంఘం ప్రతినిధి బృందం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్, డివిజనల్ ఇంజనీర్‌కు సబ్ డివిజన్‌లో గల రైతుల వివిధ సమస్యల మీద వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో రైతుల పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర రక్షణ కవచం గాని ఏబి స్విచ్ ఆన్ ఆఫ్ సిస్టం సరిగ్గా లేకపోవడం వలన పశువులు, రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారని అన్నారు. జిల్లాలో సరిపడా సిబ్బంది లేకపోవడం వలన రైతులు వారి బోరు మోటార్ దగ్గర వారి ఎలక్ట్రికల్‌కు సంబంధించినటువంటి పని చేసుకోవడం వల్ల గతంలో అనేక ప్రమాదాలు జరిగాయన్నారు. రైతుల ట్రాన్స్‌ఫార్మర్ల వారిగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు నరసింహ, సదానందం, మహేష్, హనుమంతు పాల్గొన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి



**అడ్డాకుల, డిసెంబరు 27 ప్రభాతవార్త:** అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామ శివారులో 336,01 సర్వే నంబర్లలో గల రైతుబంధు నిలుపుదల గురించి బుధవారం డిప్యూటి తహసిల్దార్ శ్రీనివాస్‌కు ఇండ్ల జాగా లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. పూర్వం గత 40 సంవత్సరాల నుండి ఇండ్లు, గుడిసెలు నిర్మించుకొని పశువుల పాగా గడ్డివాములు పెట్టుకొని జీవిస్తున్నామని తెలిపారు. పై సర్వే నంబర్లు గల భూమిని గ్రామ కంఠంలో చేర్పించాలని కోరారు. ఎంపిటిసి గణేష్, లబ్ధిదారులు చాకలి శ్రీనివాసులు, ఎరుకలి వెంకటేశ్వర్లు, చాకలి కృష్ణయ్య, తెలుగు ఆంజనేయులు, మంగలి చెంద్రాయుడు, చాకలి కిష్టమ్మ, ఈడిగ బాల రాజు, చాకలి చిలకమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన ఘటనపై కేసు నమోదు

**వెల్దండ, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందినకాటిక మణికంఠపై అదేగ్రామానికి చెందిన కొప్పు ప్రవీణ్ మంగళవారం దాడి చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్ఐ శ్రీనివాస్‌తెలిపారు. ఎస్ఐ తెలిపిన కథనం ప్రకారం.. కొప్పు ప్రవీణ్ పాత విషయాలు మనస్సులో పెట్టుకొని మణికంఠపై దాడి చేశారని, బాధితుడిఫిర్యాదు కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి మండలంలో ప్రజాపాలన

**ఉప్పునుంతల, డిసెంబరు 27 ప్రభాతవార్త:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నేటినుంచి గ్రామ పంచాయతీల వారిగా గ్యారంటీ పథకాలపై లబ్దిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపిడిఓ లక్ష్మణ్‌రావు, తహసిల్దార్ తబితారాణి, మండల మండల పంచాయతీ అధికారి నారాయణ పర్యవేక్షణలో నేటినుంచి వచ్చే సంవత్సరం జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నేడు గురువారం ఉప్పునుంతల, వెల్టూరు తాడూరు గ్రామ పంచాయతీలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా 29న కంసాన్‌పల్లి, కంసానిపల్లి తండా, జప్తి సదగోడు, తిర్మలాపూర్, 30న గువ్వలోనిపల్లి, ఈరట్వాన్‌పల్లి, పిరట్వాన్‌పల్లి, అయ్యవారిపల్లి, జనవరి 2న పెనిమిళ్ల, సిబితండా మర్రిపల్లి, ఉప్పరపల్లి, 3న మామిళ్ళపల్లి, దాసర్లపల్లి, 4న పెద్దాపూర్, మొల్గర, తిప్పాపూర్, 5న దేవదారికుంట తండా, లతిపూర్, సూర్యతండా, 6న లక్ష్మాపూర్, రాయిచేడు, సూర్య తండాలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వివరించారు. ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీలో టేబుల్ ఇంఛార్జిలను నియమించడం జరిగిందని ఎంపిడిఓ వివరించారు.

## జనవరి 3న సంగం శరణం గచ్చామి అనే ప్రత్యక్ష నాటకం

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్27, ప్రభాతవార్త:** జనవరి 03వ తేదిన సాయంత్రం 5.30గంటలకు జిల్లా కేంద్రంలోని సురవరం సాహితి కళాభవన్ నందు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి హైదరాబాద్ ఆధ్వర్యంలో డా.బిఆం అంబేద్కర్ జీవిత చరిత్ర, లక్ష్యం గురించి సంగం శరణం గచ్చామి అనే ప్రత్యక్ష నాట కం వేయబగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి సుషిత బుధవారం ఒకప్రకటన ద్వారాతెలిపారు. ఈ ప్రత్యక్ష నాటకంకు కార్యక్రమం కుజిల్లాలోని ప్రజలందరు హాజరై వీక్షించాలని ఆమె ప్రకటన ద్వారా కోరారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి పేషంట్‌ల తకిడి




**వనపర్తి టౌన్, డిసెంబర్27, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో పేషంట్లో క్యూలైన్ నిలబడి అవస్థలుపడుతున్నారు జిల్లా సూపరెంట్ అధికారులు స్పందించి ఇంకా టోకెన్ కాంటర్లు సంఖ్య పెంచి మేరగైనా సదుపాయం అందిచి మరియు ఫార్మసీ అనీ రకాల మందులు ఉండే విధంగా కలిపించాలి అని ప్రజలు కోరుకుంటున్నారు, సీజనాలు వ్యాధులు ఏకవతనై కారణంగా మాస్కులు మరియు శానిటేషన్ సౌకర్యం కలిపించాలని కోరుకుంటూనారు.

## పంచెలు అందజేసిన బిఆర్ఎస్ నాయకులు



**మల్దకల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** శ్రీశ్రీస్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం దేవుణ్ణి సేవలు పనిపాట చేసేవారు కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మాదిగ కులాలకు చెందినటు వంటి, దేవుణ్ణి సేవలో పనిచేసే వారందరికీ జోగులాంబ గద్వాల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఆలయ చైర్మన్ వ్యవస్థాపక వంశీయులు శ్రీకష్ణ మాన్యా పట్వారీ ప్రహ్లాదరావు, ఆలయ ఈవో సత్య చంద్ర రెడ్డి చేతులమీదుగా సుమారు వందమందికి పైగా పంచెలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోపూల కరుణాకర్, ఎంపీపీ వైరాజారెడ్డి, ఎంపీటీసి జయ్యమ్మ నర్సింహులు, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటన్న, జమ్ములమ్మ ఆలయ ఈవో పురేందర్, బిఆర్ఎస్ నాయకులు సీతారామిరెడ్డి, కొంకతి నరేందర్, బాచి, చంద్ర శేఖర్‌రెడ్డి, మధు, పరుష, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

**పాన్‌గల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** బహిరంగంగా మద్యం సేవించిన మద్యం సేవించి వాహనాలు నడిపిన చర్యలు తప్పవని ఎస్సై వేణు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగంగా మద్యపానం నిషేధమన్నారు. బహిరంగంగా మద్యంసేవించి ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు మద్యం సేవించి తాగిన మత్తులో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు. అదేవిధంగాలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని పరస్పర గొడవలు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పిటి కేసులను రాజీ చేసుకోవాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామచందర్ పోలీస్ సిబ్బంది రామ్‌గోపాల్ వర్మరుక్మద్దీన్ పాల్గొన్నారు.



# 6 గ్యారెంటీల అమలుకు శ్రీకారం

## -పాల్గొననున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి

**ఊర్కొండ, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం 6 గ్యారెంటీలకు లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని విజయ వంతం చేద్దామని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ధ్యాప నికి ల్‌రెడ్డి మాట్లాడుతూ పారదర్శకమైన పాలనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టిన అభయహస్తంలోని 6 గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం క్రింద ప్రతి నెల రూ.2500ల ఆర్ధిక సహాయం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా పథకం క్రింద ప్రతి ఏటా రైతు లకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15వేలు, ప్రతి ఏటా వ్యవసాయ కూలీ లకు రూ.12వేలు, వరి పంటకు రూ.500ల బోనస్, ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఇండ్లు లేని వారికి ఇంటి స్థలం, రూ.5లక్షల సహాయం, ఉద్య మకారులు, అమరవీరుల కుటుంబాలకు 250 చ॥గజముల స్థలం, గృహ జ్యోతి పథకం క్రింద 200యూనిట్ల ఉచిత విద్యుత్, చేయూత పథకం క్రింద నెలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేల ఫింఛన్ల కొరకు నేడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ కార్యక్రమానికి మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదే విధం గా రాచూర్ గ్రామంలో వాల్మీకి విగ్రహా ఆవిష్కరణ, గ్రామ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# కల్వకుర్తి అభివృద్ధికై సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి అభివృద్ధికై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. బుధవారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలని, కల్వకుర్తి అభివృద్ధికై ప్రత్యేక నిధులు సమకూర్చాలని సీఎంను కోరారు. సీఎంను కలిసిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ ఉన్నారు.

# జిల్లా స్థాయి ఖేల్ కూద్ పోటీలు



దాతలను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** స్థానిక సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియాం ఎర్రగడ్డ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఆటల పోటీల్లో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు వాస రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ప్రతి రోజు క్రీడలు ఆడటం వల్ల దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. మానసిక ప్రశాంతత పెరిగి విద్యపైన శ్రద్ధ కనబరుస్తారని తెలిపారు. బహుమతుల దాతలను, ప్రముఖులను పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు విద్యరెడ్డి, శివశంకర్, జిల్లా కార్యదర్శి బాలరాజు, మిడిదొడ్డి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# సహకార సంఘంలో సభ్యత్వం కొరకు రైతులు ధరఖాస్తులు చేసుకోవాలి



తలసాని జనార్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్

**కల్వకుర్తి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి, ఊర్కొండ మండలాల్లో వ్యవసాయ భూములు కలిగిన రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం పొందవచ్చునని ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ తల సాని జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 01వ తేదీ నుంచి రైతులు సభ్యత్వాలు పొందవచ్చునని, సభ్యత్వాలు పొందాలనుకునే రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్, 3పాస్ పోర్ట్ సైజుఫోటోలు, రూ.350లు సభ్యత్వ ఫీజు చెల్లించాల న్నారు. రూ.500లు చెల్లించి ఖాతా ఓపెన్ చేసి సంబంధిత పత్రాలను పీఏసీఎస్ నూతన కార్యాలయంలో అందించాలన్నారు. ఇట్టి అవకాశాన్ని ఆయా మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ప్రజా పాలనను విజయవంతం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాంబాయి

**పాన్‌గల్, డిసెంబర్27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా నేటి నుండి చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని మండలంలో వ్యాప్తంగా ప్రకటిస్తున్న తేదీల ప్రకారం ఆయా గ్రామాల్లో విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారాలు తహసిల్దార్ రాంబాయి ఇంచార్జ్ ఎంపీడీవో రఘురాములుఅన్నారు. బుధవారం మండలపరిషత్‌కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో లబ్దిదారుల నుండి వచ్చే దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ప్రభుత్వం కల్పించే సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలని కోరారు. సమావేశంలో ఎంఈఓ లక్ష్మణ్ నాయక్ ఏపీఎం సక్రు నాయక్ ఎస్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల్లో మేధోమధనం జరగాలి

## సబ్జెక్టు ఫోరాల సహకారం అవసరం : మహబూబ్‌నగర్ డీఈఓ రవిందర్




మాట్లాడుతున్న డీఈఓ రవిందర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు27 ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల్లో మేధోమధనం జరిగి బోధనలో నూతన వ్యూహాలకు పదునుపెట్టి విద్యార్థులు పాఠ్యాంశాలపై సమగ్ర పట్టు సాధించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు పరచాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌విఎం సమావేశ మందిరంలో జరిగిన సబ్జెక్టు ఫోరం ఉపాధ్యాయుల పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించాలని వార్షిక పరీక్షల్లో వచ్చే ప్రశ్నాపత్రాలపై సమగ్ర అవగాహన కల్పించాలని డీఈఓ సూచించారు. ప్రత్యేక తరగతులను తప్పనిసరిగా నిర్వహించాలని వారాంతపు పరీక్షల ద్వారా విద్యార్థులకు విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. పాఠ్యాంశాలపై ప్రత్యేక క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించాలని కోరారు. పదవ తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందు నిలపాల్సిన బాధ్యత సబ్జెక్టు ఫోరాలపై ఉందని ఆయన అన్నారు. పాఠశాల సముదాయ సమావేశాలను ప్రత్యే క వనరులుగా ఉపయోగించుకోవాలనిఉపాధ్యాయులు రూపొందించిన ప్రత్యేక బోధనోపకరణలను కాంప్లెక్స్ మీటింగ్‌లలో ప్రదర్శిస్తూ ఇతర ఉపాధ్యాయులకు కూడా ప్రేరణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీని వాస్, సబ్జెక్టు ఫోరాల ప్రతినిధులు, పల్లెర్ల రామమోహన్‌రావు, శరత్‌చంద్ర, రాకేష్, బషీర్ అహ్మద్, రతంగ్‌పాండురెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలి

## ◆ ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.కిరణ్



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్. కిరణ్

**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంగా 18 వేలు నిర్ణయించాలని, పెండింగ్‌లో ఉన్న వంట బిల్లులను వెంటనే చెల్లించాలంటూ తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగిందని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్. కిరణ్ అన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మక్తల్ మండల అధ్యక్షులు లక్ష్మి అధ్యక్షత వహించగా, జిల్లా నాయకులు పద్మమ్మ, ఎస్.కిరణ్ మాట్లాడారు. నారాయణపేట జిల్లాలో 512 వంట ఏజెన్సీలు ఉండగా, అందులో 1527 మంది కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులకు సకాలంలో బిల్లులుచెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మధ్యాహ్నం భోజనాల బిల్లులు సక్రమంగారాక కార్మికులు అప్పులు చేసి పాఠశాలలో విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులకు ప్రభుత్వం కోడిగుడ్లు కూడా పెట్టలేని పరిస్థితి దాపురించిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కోడిగుడ్ల బిల్లులు కూడా చెల్లించలేని దుస్థితి దాపురించిందన్నారు. దాదాపు మధ్యాహ్న భోజన బిల్లులు పదినెలలు గడుస్తున్న నేటికి ఒక్క రూపాయి కూడా బిల్లులు రాలేదని మండిపడ్డారు. బిల్లులు చెల్లించే వరకు మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయిస్తామని ఆయన హెచ్చరించారు. దశాబ్దాలుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పసిపిల్లలకు వంటలు వండి పెడుతున్న కార్మికులకు కనీసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తింపు కార్డు కూడా ఇవ్వడం లేదని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ హక్కులైన ప్రావిడెంట్ ఫండ్ ఈఎస్ఐ గ్రాట్యుటీ తదితర చట్టాలను అమలు చేయకుండా కట్టు బానిసల్లాగా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆయన విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఒక కార్మికురాలి కుటుంబం బతకడానికి కనీసం 26వేల రూపాయలు అవసరమని శాస్త్రబద్దంగా తేల్చిందని, కాని ఈ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న బోజన పథకం కార్మికులకు గౌరవ వేతనం పేరుతో రోజుకు 30 రూపాయలు నెలకు వెయ్యి రూపాయల చొప్పున వేతనమిస్తూ అక్కడ సుప్రీంకోర్టును ఇక్కడ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు లక్ష్మి, వెంకటమ్మ, జ్యోతి, రాజమ్మ, జయమ్మ, పర్వీన్‌బేగం, రాజమ్మ పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలతో పాటు రేషన్ కార్డు దరఖాస్తులను స్వీకరించాలి

● వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ● పలు అంశాలను ఇంఛార్జ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్27, ప్రభాతవార్త:** నేటి నుండి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంలో తీసుకునే ఆరు గ్యారెంటీల దరఖాస్తులతో పాటు అదనంగా రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులను సైతం తీసుకోవాలని పార్టీలకు అతీతంగా దరఖాస్తుల స్వీకరణ జరగాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమంపై మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి పలు అంశాలను తీసుకుని వెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గ పరిధిలో చాలా వరకు రేషన్ కార్డుల సమస్య ఉందని ఆరు గ్యారెంటీల దరఖాస్తులతో పాటు మిగితా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సైతం వీటితో పాటు దరఖాస్తుల స్వీకరణ జరిగితే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఇంచార్జి మంత్రి దామోదర రాజనర్సింహ గ్రామాల్లోని దరఖాస్తుల స్వీకరణ కేంద్రం వద్ద ఇతర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సైతం తీసుకునేందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసే విధంగా చూడాలని కౌంటర్ల వద్ద ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా తగిన మౌళిక వస తులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# కమ్యూనిస్టుల పోరాటం వల్లనే పేదలకు సంక్షేమ పథకాలు



**వీపనగండ్ల, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** సిపిఐ త్యాగాలు కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగానే దేశంలో పేదలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతు న్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఎం.డి ఫయాజ్ అన్నారు. వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలో బుధవారం రాత్రి 7:30 గంటలకు సిపిఐ 99వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహం వద్ద పార్టీ జెండాలు ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1925, డిసెంబర్ 26న ఆవిర్భవించిన పార్టీ కాళ్లయిన ఆరని పసి వయసు లోనే స్వాతంత్ర పోరాటం కదన రంగంలో దూకిందన్నారు. తెలంగాణ విముక్తి పోరాటంలోనూ, తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమాలు నడిపిందన్నారు. 99 ఏళ్లుగా విప్లవ స్ఫూర్తితో పేద ప్రజల కోసం అంకితభావంతో పోరాడుతోందన్నారు. ప్రపం చంలో శ్రమదోపిడి ఉన్నంతవరకు ఎర్రజెండా ఎగురుతూనే ఉంటుందని, ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. సిపిఐ మద్దతుతోనే నియం తృత్వ బిఆర్ఎస్ ను గద్దెదించి రాష్ట్రంలోకాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరు గ్యారెంటీలు ప్రకటించిందన్నారు. వాటిని చిత్తశుద్ధితో అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్కు మద్దతు ఇచ్చిన ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తే పోరాటాలు కొనసాగుతాయన్నారు. సిపిఐ లో చేరాలని ప్రజలను కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, వంక గోపాల్, కాటం హనుమంతు, చెన్నమ్మ, చల్మారెడ్డి, కాశన్న, సహదేవ్, కొల్లాపూర్, కోడేరు నాయకులు పాల్గొన్నారు. ముందుగా కళాకారులు డప్పులు తప్పెట్ల దరువుకు అనుగుణంగా కదం తొక్కుతూ గ్రామంలో వహించిన ర్యాలీ ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం గ్రామంలో సభ నిర్వహించారు.

# ఘనంగా పాల ఉట్ల కార్యక్రమం

**మక్తల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** మక్తల్ పడమటి ఆంజనేయస్వామి పాలుట్ల కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో ఘనంగా జరిగింది. కార్యక్రమాన్ని తిలకించటానికి రామలీల మైదానంలో దేవస్థానం వారు పాలుట్ల స్థభాన నలువైపుల విద్యుత్ దీపాల అలంకరణతో అందంగా తీర్చిదిద్దారు. పాల ఉట్లను ముదిరాజ్ కులానికి చెందిన పడమటి ఆంజనేయస్వామి వారి సేవకులు (దాసరి) ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్థంభానికి పై భాగంలో పాలు పెరుగును కొత్త కుండలో పోసి వాటిని ఉట్టిలో ఉంచి స్థంభానికి పై భాగమున వేలాడదీస్తారు. దానికి చివరన కొబ్బరిను కట్టి ఉంచుతారు. ఆ ఉట్టిని పగలకొట్టేందుకు (దాసరి) వంశానికి చెందిన యువకులు పోటీ పడతారు. దీనివల్ల తమకు ఈ సంవత్సరం మొత్తం అంత మంచే జరుగుతుందని మూఢ విశ్వాసం. అవుతున్నట్లు అన్నారు. పాల ఉట్లను రాజు అనే వ్యక్తి అందించుకున్నారు. ఉట్టి పగులకొట్టిన వారికి దేవస్థానం వారు ఐదు వందల ఒక రూపాయి బహుమానం ఇచ్చి శాలువాతో సన్మానిస్తారు.



పాల ఉట్లను పగులకొడుతున్న దృశ్యం

# కరోనా పట్ల జాగ్రత్తలు పాటించాలి



శ్రీనివాస్, బాలానగర్ ఎస్సై

**బాలానగర్, డిసెంబరు27 ప్రభాతవార్త:** శీతాకాలం ప్రారంభం కావడంతో పొగ మంచు కమ్మేస్తుంది. ఉదయం 8 గం.లు దాటినప్పటికి పొగమంచు మాత్రం వదలట్లేదు. ఉదయం 9 గం.ల తర్వాత సూర్యకిరణాలు మెల్ల మెల్లగా భూమిని తాకుతున్నాయి. పొగ మంచుతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, లేదంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని బాలానగర్ ఎస్సై శ్రీనివాస్ సూచించారు. అలాగే కరోనా పట్ల జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఉద్యోగులు, పాల వ్యాపారులు, వ్యవసాయ దారులు, ప్రయాణీకులు రోడ్డుపై వెళ్తున్న ప్పుడు పొగమంచు పోయే వరకు జాగ్రత్తగా ఉండాలన్నారు. గత 3,4 రోజులుగా పొగమంచు కురు స్తున్న సందర్భంగా ప్రజలు జాగ్రత్తల పాటించాలని ఇంకా, 2 నుంచి 3 రోజులు పొగమంచు కురిసే అవకాశం ఉందని తెలిపారు. అలాగే రాష్ట్రంలో మళ్లీ కరోనా వైరస్ మొదలైందని ఈ సంవత్సరం కరోనా వల్ల హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో తొలి మరణం నమోదైందని తగిన జాగ్రత్తలు పాటించాలని ఎస్సై పిలుపునిచ్చారు.

# ప్రజా పాలన గ్రామసభలకు అధికారుల నియామకం

**చిన్నచింతకుంట, డిసెంబరు27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రజాపాలన గ్రామసభలను నేటినుంచి వచ్చేనెల జనవరి 6 వరకు నిర్వహిస్తున్నారు. ఈ ప్రజా పాలన గ్రామ సభలలో ఆయా గ్రామాల్లోని లబ్దిదారుల నుంచి దరఖాస్తు పత్రాలను మండల గ్రామస్థాయి అధికారులు స్వీకరిస్తారని గ్రామసభల పర్యవేక్షణ అధికారులు తహసిల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. నేడు చిన్నచింతకుంటలోని సంతబజారులో, ఏదులాపూర్, ఉంద్యాల, చిన్నవడ్డెమాన్‌లోని గ్రామ సచివాలయంలో, 29న పర్దీపూర్, గోప్య నాయక్ తండా, బండర్‌పల్లి, పల్లమర్రి, 30న లాల్‌కోట, నెల్లికొండి, 2024 జనవరి 2న వడ్డెమాన్, దమగ్నాపూర్, 3న మద్దూరు, అల్లీపూర్, అమ్మాపూర్, గూడూరు, 4న సీతారాంపేట, కురుమూర్తి గ్రామాలలోని గ్రామ సచివాలయాల్లో ప్రజాపాలన గ్రామ సభలను నిర్వహిస్తున్నారు. ఈ గ్రామసభలకు తహసిల్దార్, ఎంపిడిఓలు రెండు విభాగాలుగా గ్రామ సభలునిర్వహిస్తున్నారు. ప్రజాపాలన గ్రామసభలనుమండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై భారత్ వికసిత సంకల్పయాత్ర

● బిజెపి మండలాధ్యక్షులు యాదగిరి సలేశ్వరం



కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బిజెపి మండలాధ్యక్షులు యాదగిరి సలేశ్వరం

**లింగాల, డిసెంబరు27 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో భారత్ వికసిత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు బిజెపి మండల అధ్యక్షులు యాదగిరి సలేశ్వరం అన్నారు. బుధవారం మండల పరిధిలోని జీల్గుపల్లి, దత్తారం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి సలేశ్వరం మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరెంద్రమోడీ 2014 నుంచి ఇప్పటి వరకు కూడా గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు పూర్తిగా వివరిస్తూ ఎల్ఈడీ స్క్రిన్ ద్వారా 50 నిమిషాల పాటు ప్రజలకు చూపిస్తూ అవగాహన కల్పించారు. గ్రామస్తులు కొత్త నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని మహిళా మృతి

**ఊర్కొండ, డిసెంబర్27 ప్రభాతవార్త:** ఊర్కొండ మండలం జకినాలపల్లి గ్రామానికి చెందిన పోలే లక్ష్మమ్మ(40) మతిస్థిమితం లేక మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. పోలే లక్ష్మమ్మ గత ఐదు సంవత్సరాల నుంచి మతిస్థిమితం లేక ఇంటి నుంచి తరుచుగా బయటకు వెళ్లి రెండు, మూడు రోజు తర్వాత వచ్చేదని, ఈ క్రమంలోనే ఆమెకు పిడ్స్ కూడా వచ్చేదన్నారు. ఈ నెల 23న ఇంటి నుంచి లక్ష్మమ్మ వెళ్లిపోవడంతో ఆమె ఆచూకీ కొరకు చుట్టు ప్రక్కలతో పాటు బంధువుల ఇండ్లలో ఆరా తీశారు. శనివారం ఉదయం గుండ్లపల్లి కృష్ణయ్య వ్యవసాయ పొలంలో మృతి చెంది ఉందని గ్రామస్తులు సూచించడంతో అక్కడికి వెళ్లి చూడగా పోలే లక్ష్మమ్మగా కుటుంబ సభ్యులు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రజా పాలన గ్రామ సభల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి



వార్డులలో పర్యటిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

**దామరగిద్ద, డిసెంబరు27 ప్రభాతవార్త:** బుధవారం జిల్లాలోని దామరగిద్ద, నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలోని 5,19 వార్డులలో పర్యటించి ప్రజాపాలన గ్రామసభ ఏర్పాటుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆర్జీలు సమర్పించే ప్రజలకు త్రాగునీరు ఇతర వసతి కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి పరామర్శ



**నారాయణపేట ప్రతినిధి, డిసెంబరు27 ప్రభాతవార్త:** చిత్తనూరు ఇథనాల్ కంపెనీ వ్యర్థ పదార్థాలను తరలిస్తున్న ట్యాంకర్ అక్టోబర్ 21న పరిసర గ్రామాల ప్రజలు అడ్డుకుని ఆ ట్యాంకర్లు ఏముందో తెలపాలని నిరసన తెలుపుతున్నారు. మహ్మద్ ఖాసిం 84సంవత్సరాల వృద్ధుడు ఆ మీటింగ్ చూద్దామని వచ్చాడు. అనంతరం జరిగిన అక్రమ లాఠీఛార్జిలో మహ్మద్ ఖాసింకు నడుము విరిగి మంచం పాలు అయ్యి చికిత్స పొందుతూ సాయంకాలం ఉంద్యాలలో చనిపోయాడు. ఎక్లాస్‌పూర్‌లో జరిగే అంత్యక్రియల్లో ఇథనాల్ పోరాట కమిటి ప్రతినిధులు, ప్రజా సంఘాలు, పరిసర గ్రామాలు ప్రజలుపెద్ద ఎత్తున హాజరు కాగలరని అన్నారు. మహ్మద్ ఖాసిం త్యాగాన్ని ఎత్తి పడుదాం. మహ్మద్‌ఖాసింమృతికి కారణమైన పోలీసులను చట్టప్రకారం శిక్షించాలి. ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని కోరారు.

# లబ్ధిదారులకే నేరుగా పథకాలు..!



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇంఛార్జి మంత్రి సి. దామోదర రాజనర్సింహ



















**మొదటి పేజీ తరువాయి భాగం..**

వరకు నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందుకుగాను ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి ఉంటారని ఆరు గ్యారంటీలకు దరఖాస్తుల స్వీకరణతో పాటు, ఇతర సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజలకు కావాల్సిన కార్యక్రమాలు ఎప్పటినుండి అమలు చేస్తారో, ఎప్పటినుండి అందుబాటులోకి వస్తాయో తెలపాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు రాములు మాట్లాడుతూ కొందరు ఇది వరకే ఆసరా పెన్షన్లు పొందుతున్నందున మహాలక్ష్మి పథకం కింద ఎప్పటినుండి లబ్ధిని అందజేస్తారో చెప్పాలని, రైతు భరోసాను ఎప్పటినుండి అమలు చేస్తారో తెలియజేయాలని, అదేవిధంగా ధాన్యం బోనస్‌కు ఒక తేదీని వెల్లడించాలని కోరారు. వనపర్తి జిల్లా పరిషత్ ఛైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల రుణమాఫీని అమలు చేసే సమయాన్ని తెలియజేయాలని, అలాగే అన్ని హామీలను ఎప్పటినుండి ప్రభుత్వం అమలు చేస్తుందో తెలియజేయాలని కోరారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సకాలంలో దరఖాస్తులు ఇవ్వని వారికి తర్వాత దరఖాస్తులు ఇచ్చేందుకు ఉన్న అవకాశాన్ని తెలియజేయాలని కోరారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ షెడ్యూల్ తర్వాత పంచాయతీలో దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు కాకుండా ఇతర అంశాలపై వచ్చిన దరఖాస్తులు కూడా స్వీకరిస్తే బాగుంటుందని తెలిపారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా అర్హత ఉన్న లబ్ధిదారులు తప్పిపోకుండా అందరు కవర్ అయ్యేలా చూడాలని కోరారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద సంవత్సరానికి ఎన్ని గ్యాస్ సిలిండర్లు ఇస్తారో తెలియజేయాలని ఇదివరకే పెన్షన్ వస్తున్న వారి నుండి దరఖాస్తులు తీసుకుంటారా అనేది తెలియజేయాలని కోరారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకం లబ్ధిదారు వరకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు.



ప్రజాపాలన సన్నాహక సమావేశంలో పాల్గొన్న సంబంధిత అధికారులు

నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డులకు సంబంధించి సూచనలతో పాటు, కొత్త గ్యాస్ కనెక్షన్లపై ప్రజలకు వివరించాలని దరఖాస్తులు తప్పిపోయిన వారిని దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. కార్యక్రమానికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, నారాయణపేట జిల్లా పరిషత్ ఛైర్మన్ వనజమ్మ, గద్వాల అదనపు కలెక్టర్ చౌహాన్, శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, నాగర్‌కర్నూల్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్, వనపర్తి జిల్లా ఎస్పీ రక్షిత పాల్గొన్నారు.













సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంట్ సభ్యులు ,జెడ్పి చైర్మన్లు,ఎమ్మెల్యేలు,కలెక్టర్లు

## నేటి నుంచి కాంగ్రెస్ ప్రజాపాలన..!!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు.గ్రామసభలు అనునిత్యం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందని,అసలు సిసలైన అర్హులైన లబ్ధిదారులకు కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అందించడమే గ్రామ సభల ప్రధాన లక్ష్యమని అధికారులు చెబుతున్నారు.

**భూత్పూర్ మున్సిపల్ వార్డుల గ్రామసభల వివరాలు :**

భూత్పూర్ మున్సిపాలిటీలోని పది వార్డులలో ఈ నెల 28నుంచి వచ్చే నెల 6వ తేది వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ప్రకటించారు.ఒకటవ వార్డుకు సంబంధించి 285కుటుంబాలకు గాను సిద్దాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో నాలుగు కౌంటర్లు,రెండో వార్డుకు సంబంధించి 293కుటుంబాలకుగాను శేరుపల్లి(బీ)లోని హనుమాన్ దేవాలయంలో నాలుగు కౌంటర్లు,మూడో వార్డుకు సంబంధించి 216కుటుంబాలకుగాను నాలుగేసి కౌంటర్లను గోప్లాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలోను,నాల్గొవార్డుకు సంబంధించి 364కుటుంబాలకుగాను ఎస్సీ కాలనీలోని వినాయక మండపంలో నాలుగు కౌంటర్లు,ఐదో వార్డుకు సంబంధించి 374కుటుంబాలకుగాను అమిస్తాపూర్‌లోని పాత గ్రామపంచాయతీలో నాలుగేసి కౌంటర్లు,ఆరోవార్డుకు సంబంధించి 321కుటుంబాలకుగాను అమిస్తాపూర్‌లోని పశువుల ఆసుపత్రిలో నాలుగు కౌంటర్లు, ఏడో వార్డుకు సంబంధించి 317కుటుంబాలకుగాను అమిస్తాపూర్ చౌరస్తాలో నాలుగు కౌంటర్లు,ఎనిమిదోవార్డుకు సంబంధించి 380కుటుంబాలకుగాను రాజీవ్‌స్వగృహలోని వాటర్ ట్యాంక్‌కు సమీపంలోని దేవాలయంలో నాలుగేసి కౌంటర్లు,తొమ్మిదోవార్డుకు సంబంధించి 434కుటుంబాలకుగాను భూత్పూర్ బీసీ కాలనీలోని వినాయక మండపంలో నాలుగేసి కౌంటర్లు, పదోవార్డుకు సంబంధించి భూత్పూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసి గ్రామ సభల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పథకాలు పొందాలని ఆయన సూచించారు.

## 6 గ్యారంటీలపై సీఎం కమిట్మెంట్..!

**దరఖాస్తుల ఆధారంగానే గ్యారంటీల అమలు**

**వృద్ధులకు మహిళలకు ప్రత్యేక కౌంటర్లు**

**ఎమ్మెల్యేలు కలెక్టర్లు ప్రత్యక్ష ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి**

**మీడియా సమావేశంలో జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ**



**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 27 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీ పథకాల అమలుపై కమిట్మెంట్‌తో ఉన్నారని మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇంఛార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాపాలన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, జడ్పీ ఛైర్మన్లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రతి గ్రామ పంచాయతీ ప్రతి వార్డులో కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. దరఖాస్తుల ఆధారంగానే 6 గ్యారంటీల పథకాల అమలు ఉంటుందని ఆయన వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. గురువారం నుంచి వచ్చేనెల జనవరి 6 తారీఖు వరకు ప్రజాపాలన సమావేశాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపిలు రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికరెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి. మధుసూదన్‌రెడ్డి, జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, చిక్కుడు వంశీకృష్ణ, మెగారెడ్డి, జడ్పీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

## ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తా...

**-లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ -ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలే నా బలం, నియోజకవర్గ ప్రజలే నా బలగమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఐదు మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎవరు కూడా అధైర్య పడవద్దని, దుష్ప్రచారాలు నమ్మవద్దన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ ఒక్క వర్గానికి కూడా న్యాయం జరగలేదని, పథకాలు పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తూ అక్రమ ఆస్తులను కూడా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ప్రజా సేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని, తనకున్న ఆసుపత్రులను సైతం తొలగించడమైందన్నారు. తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ఎవరికి ఏ కష్టం వచ్చిన తన కష్టంగా భావించి ప్రజలకు సేవలు అందించడానికి ముందుంటానన్నారు. నేడు గ్రామాల వారీగా అధికారులు వచ్చి సంక్షేమ పథకాల ధరఖాస్తులు అందజేయడం జరుగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కక్ష్యపూరిత రాజకీయాలు, డబుల్ సంపాదించుకోవడానికి రాజకీయ రంగ ప్రవేశం చేయలేదని, పేద ప్రజలకు మేలు చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అనంతరం నియోజకవర్గ ప్రజలకు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఇన్‌చార్జి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ నిర్మల జానకి రాములు, జెడ్పీటీసీ రోహిణి గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీనివాసులు, సునెంద్ర, సుల్తాన్, నిజాం, అచ్యుతారెడ్డి, సర్పంచ్‌లు దాసర్ల స్వామి, ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణయ్య, రాజు, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

## ప్రజా పాలన విజయవంతం చేసేందుకు ప్రతినిధులు సహకారాలు అందించాలి:నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జి ఆర్డీఓ రాంరెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27 ప్రభాతవార్త:**పేద ప్రజలకు ప్రభుత్వం అందించే ఆరు గ్యారెంటీలకు ప్రజా పాలన కార్యక్రమాన్ని ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ధరఖాస్తులు స్వీకరిస్తామని, గ్రామ, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నాగర్‌కర్నూల్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ రాంరెడ్డి సూచించారు. బుధవారం సాయంత్రం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గ సర్పంచ్‌లు, ఎంపీపీలు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో ఈ నెల 28 నుంచి నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమంపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా ప్రజల నుంచి ధరఖాస్తులు తీసుకుంటామని, అర్హత ఉన్న వారు గ్రామ సభల్లో అధికారులు ధరఖాస్తులు అందజేస్తారని,ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు భాగస్వాములై అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన సూచించారు. ధరఖాస్తులు తీసుకున్న తర్వాత అధికారులు రసీదు ఇస్తారని తెలిపారు. అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు మరో గ్రామానికి వెళ్లి ఫిర్యాదులు స్వీకరిస్తారని, గ్రామ సభ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి తీసుకుంటారని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా చూడాలని ఆయన ప్రజా ప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటి వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. జెడ్పీ సీఈఓ ఉష మాట్లాడుతూ గ్రామస్తుల నుంచి వచ్చే ఫిర్యాదులను తీసుకోవడానికి సరిపడ కౌంటర్లు ఏర్పాటు చేయడం, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తదితర అంశాల పట్ల అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆమె సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించే ప్రజా పాలన వివరాలను డీఎల్పీఓ రాంమోహన్‌రావు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, అధికారులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

## పాలమూరులో తొలి పాజిటివ్ కేసు..

**151 ఆర్టీసి టెస్టులు.. ఒకరికి స్వల్ప లక్షణాలు ఉన్నాయి**

**వెల్లడించిన మహబూబ్‌నగర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ జీవన్**

**మహబూబ్‌నగర్‌బ్యూరో,డిసెంబరు27 ప్రభాతవార్త:** పాలమూరు జిల్లాలో తొలి కరోనాపాజిటివ్ కేసు నమోదు అయింది. ఇప్పటికి జిల్లాలో 151 ఆర్టిపిసిఆర్ టెస్టులు నిర్వహించగా ఒకరికి స్వల్ప లక్షణాలు ఉన్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ప్రధాన దవాకాన సూపరింటెండెంట్ డా.జీవన్ బుధవారం వెల్లడించారు. రోగికి స్వల్పంగా బాడీ పెయిన్స్‌తో పాటు జలుబు, దగ్గు ఉండడంతో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా వైద్యులు సూచిస్తు న్నారు. జనసంచారం ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో తప్పనిసరి మా స్కులు ధరించాలని తరచూ సానిటైజర్ వాడాలని సూచిస్తున్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి కేసునమోదు:ఎస్ఐ

**చిన్నచింతకుంట,డిసెంబరు 27 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అను మానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడని ఎస్సై ఆర్. శేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కురు మూర్తి గ్రామానికి చెందిన బత్తుల భరత్‌కుమార్ (35) మంగళవారం అనా రోగ్యంతో బాధపడుతూ జిల్లా ఆసుపత్రికి వెళ్లగా అక్కడ అనుమానా స్పదంగా మృతి చెందాడు. మృతుని తల్లి మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బిసిలు ఐక్యతతో ముందుకెళ్లాలి.. బిసి ఐక్యవేదిక కమిటి అధ్యక్షులు రాజుల యాదవ్

**లింగాల,డిసెంబరు 27 ప్రభాతవార్త :** బిసిలు అందరు ఐక్యతతో ఉండి బిసి ఐక్యవేదికను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిసి ఐక్యవేదిక కమిటి అధ్యక్షులు రాజాలు యాదవ్ అన్నారు. బుధవారం లింగాల మండల కేంద్రంలోని బిసి ఐక్యవేదికపై కార్యాచరణ గురించి బిసిల అన్ని కులస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలువురు ఐక్యవేదిక సభ్యులు మాట్లాడుతూ కమిటి సభ్యులు సమయ పాలన పాటించి బిసి ఐక్యవేదిక ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. బిసి ఐక్యవేదిక అనేది మనకు అవసరం ఉన్న బిసి ఐక్యవేదిక అనేది మనకు అవసరం ఉన్న లేకున్నా మన పిల్లల భవిష్యత్తుకు చాలా అవసరం ఉన్నారు. రానున్న రోజుల్లో బిసిలకు రిజర్వేషన్ వస్తే ఖచ్చితంగా బిసి ఐక్యవేదిక నాయకునికి అవకాశం కల్పించి గెలుపొందుటకు ప్రతి బిసి సభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని బిసిలందరు పాల్గొన్నారు.



లింగాల బిసి ఐక్యవేదిక సమావేశం